


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**మహా కన్యాదేవి** కల "అమ్మా చిన్న చిన్న జీవులు.. దోమలకన్నా పదిరెట్లు చిన్నవి కేవలం చీమలంత ఉండేవి కోట్ల కొద్ది క్షణాల్లో పుట్టి, పెరిగి, మనుషుల్నీ వృక్షాలనీ కాటేస్తున్నాయి. జంతువులూ పక్షులూ వాటిని క్రోధంగా మింగేస్తున్నాయి. వృక్షాలూ, మొక్కలూ, కాండాలూ మాత్రం క్షణాల్లో ఆ విచిత్ర జీవులకి ఆహారమౌతున్నాయి. పచ్చదనం మీద పగబట్టినట్లు ఉన్నాయి ఆ విచిత్ర జీవులు. వేలకొద్దీ రాకాసి గద్దలు ఇనుప ముక్కులతో జంతువుల్ని చీల్చుకు తింటుంటే, మనుషులు లోతైన సొరంగాలు తవ్వుకుని, ఒణుకుతూ అందులో బావురమని ఏడుస్తున్నారు. కొమ్ము్మా, బాణాలు చేతపట్టిన మనుషులు కాని మనుషులు వాళ్ళని కొరడాలతో చితకబాదుతున్నారు.

వర్షాలు భీకరంగా పడి ఆ విచిత్ర జీవులు కొట్టుకుపోగా, సొరంగాలు నీటితో నిండి మనుషులు కాలం చేశారు. భూమంతా వర్షపు నీళ్ళలో కొట్టుకొస్తున్న బండరాళ్ళతో నిండి వుంది. వందలు వేలుగా మహా సర్పాలు ఆ నీటిలో యీదుతూ దొరికిన వాటినన్నిటినీ మింగేస్తున్నాయి. సూర్యచంద్రుల జాడలేదు. ఆకాశం బూడిదరంగు పులుముకుని ఉంది."

ఒక ట్రాన్స్‌లో చెబుతున్నట్టుగా మహా కన్యాదేవి మంద్రస్థాయిలో చెబుతూనే ఉంది. మహామాయా, హనుమంతూ ఇతర కన్యలూ భయంతో వింటున్నారు.

"ఆ తరవాత" అన్నది మహామాయ. కూర్చున్నదల్లా మహాకన్యాదేవి వెనక్కి ఒత్తిగిల్లింది. ఆ చర్య మహా కన్యాదేవిది 'కానట్టు'గా హనుమంతుకి అనిపించింది.

"మహాభారత సైనికులు రూపు మార్చుకుని వస్తున్నారు. విచిత్రమైన ఆయుధాలు వారి శరీరం మీద ఉన్నాయి. వికటాట్టహాసాలు మిన్ను ముడుతున్నాయి. రధాలకి కట్టినవి అశ్వాలు కాదు మనుషులు. వాళ్ళే రధాల్ని లాగుతున్నారు. సారధులు ఆ మనుజ అశ్వాల్ని కొరడాలతో కొడుతున్నారు.. అబ్బ భయంకర రోదనం" అన్నది మహా కన్యాదేవి.

"ఊ" అన్నది ఆలోచిస్తూ మహామాయ. హనుమంతు మిగతా కన్యలు వారిద్దరినీ చూస్తూ వున్నారు. మహాకన్యాదేవి అంత చిత్రంగా ఒత్తిగిల్లడం ఏనాడూ హనుమంతు చూడలేదు. 'మాట్లాడేది మహాకన్యాదేవా, ఆమె శరీరంలోంచి మరొకరు మాట్లాడుతున్నారా?'అనే సందేహం కూడా హనుమంతుకి వచ్చింది. కొన్ని నిముషాలు మహాకన్యాదేవి కళ్ళను మూసుకునే ఉన్నది.

"లక్షల కొద్దీ బాలలు ఉయ్యాలతొట్లలో వికృతంగా నవ్వుతూ ఊగుతున్నారు. ఏ ఒక్కరి తల్లీ తండ్రీ కనిపించడంలేదు. అసలు వారికి తల్లీ తండ్రీ లేరేమో! ఎవరెవరో వచ్చి కొంతమందిని పెట్టెల్లో పెట్టి తీసుకుపోతున్నారు. ఆ వచ్చిన వాళ్ళూ మనుషుల్లా లేరు. యంత్రాల్లా ఉన్నారు. అంతా భయంకరమైన నిశ్శబ్దంలో కూరుకుపోయి ఉంది.

సముద్రాల్లో మంటలు. తాడెత్తున ఎగసిపడే అలలు. ఊళ్ళకి ఊళ్ళు సముద్రంలో కకావికలై కలిసిపోతున్నాయి." కళ్ళు మూసుకునే చెబుతోంది మహాకన్యాదేవి.

వింటున్న కన్యల మొహాల్లో భయం. మహామాయ నిశ్చేష్టురాలైవింటోంది. హనుమంతుకి ఎన్నో ప్రశ్నలు పుట్టుకొచ్చాయి. అయినా ఎవర్నీ అడగటం?

"ఓయీ.. కాలమనే కాలనాగు యీ చివరనించి మింగుతూ వస్తోంది ప్రపంచాన్ని. బుసలు కొట్టి విసిగిపోయి లోకాన్ని కబళించడం మొదలు పెట్టింది. దాన్ని ఆపేదెవరూ?"

మళ్ళీ ఆగింది మహాకన్యాదేవి. కళ్ళు మూసుకునే ఉంది. మొహం అంతా చెమట బిందువులు. దేముని దగ్గర వెలిగించిన దీపకాంతి ఆ చెమట బిందువుల మీదపడి ఆ బిందువులు వజ్రాల్లా మెరుస్తున్నాయి.

"ఆకాశం నించి నిప్పులు కురుస్తున్నాయి. నీటిలో నించి నిప్పులు చిమ్ముకుంటూ ఏవో ఆకాశంవైపు వెళ్తున్నాయి. చెట్లు విహ్వలంగా ఊగిఊగి కూలిపోతున్నాయి. భవనాలు కూలి పల్లెలూ, పట్నాలూ దూళితో మునిగిపోతున్నాయి. గోవులు కట్లు తెంచుకుని అడవులవైపుకి పారిపోతున్నాయి. అడ్డువచ్చిన పులుల్ని కొమ్ముల్తో కుమ్మేసి చంపుతున్నాయి. లక్షలాది మిడతలు చెట్లమీద వాలి కరకరా నమిలేస్తున్నాయి ఆకుల్ని. భగవంతుడా!" మహాకన్యాదేవి మూసి వున్న కళ్ళల్లోంచి కన్నీరు ధారగా కారుతోంది.

వారందరూ ఇప్పుడు ఉన్న ఊరిపేరు కుంద్రత్తూరు. అక్కడ చాలా ప్రసిద్ధి చెందిన మూడు ఆలయాలు ఉన్నాయి. ఒకటి కొండమీద అరుళ్ మహా సుబ్రహ్మణ్యస్వామిది. ఉత్తరం వైపు చూస్తూ సుబ్రహ్మణ్యస్వామి తన దేవేరులైన వల్లీ, దేవసేనలతో నిలబడి ఉంటారు. ఒక చోళరాజు కట్టిన యీ దేవాలయం ఎప్పటిదో స్పష్టంగా తెలీదు. తిరుత్తిణికి ఎంత ఆకర్షణ శక్తి ఉందో యీ గుడికీ అంతే ఆకర్షణ శక్తి, అంతే ఆకర్షణ శక్తి ఉందనీ అయితే ఇక్కడి స్వామి పరీక్షిస్తేగానీ వరాలు ప్రసాదించరని అంటారు. ఈ గుళ్ళో సుబ్రహ్మణ్య స్వామి, వల్లి, దేవసేన కాక విఘ్నేశ్వరుడు, దుర్గా, ఓ మహా రావిచెట్టు, నిత్యాన్నదానం ఇలా చాలా విషయాలు ఉన్నాయి.

కొండగాలి సుడులు తిరుగుతూ శరీరాన్ని స్పృశిస్తూ ఉంటే మనకి అద్భుతమైన ఆనందం కలుగుతుంది.

ఇక కొండ కింద ఊరిలో అయితే శివ, విష్ణు దేవాలయాలు ఉన్నాయి. కుళోత్తుంగ చోళుడి ముఖ్యమంత్రి గొప్పకవి 'పెరియ పురాణం' పేరుతో 63 శివభక్తులు (నయనార్లు) జీవిత సారాంశాన్ని వ్రాసిన షేక్కిలార్ దేవాలయం కూడా కుంద్రత్తూర్‌లో ఉంది.

అద్భుతమైన శివాలయం, అంతే అద్భుతమైన విష్ణువు గుడి పక్కనే ఉంది.

ఇక్కడ వెలసిన శ్రీ మహా విష్ణువు పేరు తిరు ఊరహత్త పెరుమాళ్. అమ్మవారి పేరు తిరువిరుందవల్లి. ఒక్కసారి చూస్తే గంటల తరబడి అక్కడే ఆ స్వామినీ అమ్మవార్నీ చూస్తూనే ఉండాలి అనిపిస్తుంది. ఆ నగలు, ఆలయ నిర్మాణం పునరుద్ధరణ చేసింది కులోత్తుంగ చోళుడు, కరికాల చోళుడు కూడా ఇక్కడ స్వామిని దర్శించి మాన్యాలిచ్చాడనేది కూడా ఉంది. (ఈ మధ్యనే కొందరు మహా దాతల సమర్పణలో గుడిని అద్భుతంగా తీర్చిదిద్దారు.)

ఇక శివుడి గుడిని కట్టించింది పెరియపురాణం వ్రాసిన షేక్కిలార్. ఆ గుడిలోని దైవం తిరునాగేశ్వరుడు. అందుకే తిరునాగేశ్వరం అంటారు. శివలింగం ఎంత పెద్దది అంటే చూస్తూ మైమరచిపోతాం. ముఖ్యంగా తమిళనాడులో నవగ్రహాల దేవాలయాల్లో ఈ దేవాలయాన్ని 'రాహుస్థల' అని అంటారు. నవగ్రహాల మూర్తులు, లెక్కలేనన్ని నాగప్రతిష్టలు ఇక్కడ చూడొచ్చు. పురుషాంగ రూపంలో ఉన్న నాగేశ్వర లింగాన్ని గుడి చుట్టూ ప్రదక్షిణం చేసేప్పుడు చూడవచ్చు. 'రాశి'

లేక, 'రాసి' ఉంటే తప్ప యీ శివుని దర్శనం కలగదని పెద్దలు చెబుతారు. బయట ఉన్న ధ్వజస్థంభం అందం, దానిమీద చెక్కిన శిల్పాల అందం చెప్పనలవికాదు. కుంద్రత్తూర్ 'తిరునాగేశ్వరం' దర్శనం చేసుకున్నారు మహాకన్యాదేవీ, మిగతా కన్యలూ, మహామాయి. గుడిలోపలే అమ్మవారికి ఎదురుగా ఒత్తిగిలి చెబుతున్నది మహా కన్యాదేవి. దర్శనానికి వచ్చిన భక్తులకి ఇబ్బంది కలగకుండా ఓ పక్కన కూర్చున్నారు అందరూ. అప్పుడే మహాకన్యాదేవి కాసేపు ధ్యానంలో ఉండి మాట్లాడసాగింది. అన్నట్లు గుడి చుట్టూ తిరిగేప్పుడు 63 నయనార్ల విగ్రహాలూ (చిన్నసైజులో) మనం చూడవచ్చు. పెరియపురాణం అంటే, పెద్ద పురాణం లేక మహా పురాణం.

గుడికి వచ్చిన భక్తుల్లో కొందరు తెలుగువారూ ఉన్నారు. వారూ మహాకన్యాదేవి మాటల్ని శ్రద్ధగా వింటున్నారు.

నవగ్రహాల్లో రాహు కేతువుల్ని 'ఛాయాగ్రహాలు' అంటారు. ఇవి నిజమైన గ్రహాలు కాదు. ఇవి గ్రహ మార్గాలని అంటే ఇతర గ్రహమార్గాల్ని ఖండిస్తాయి. ఈ రెండూ చంద్రుడు భూమి కక్ష్యలను దాటుతాయి. వీటివల్లనే గ్రహణాలు ఏర్పడేది.

ప్రజలపైన వీటి ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. శ్రీకాళహస్తిలో ప్రజలు వాయులింగాన్నీ, అమ్మవార్నీ దర్శించుకోవడానికే కాదు, రాహు, కేతు గ్రహశాంతులకు, సర్పదోష నివారణకు కూడా వెళ్తారు. అక్కడ పూజలు చేస్తే రాహుకేతు గ్రహదోషాలు తొలుగుతాయని కేవలం నమ్మకమేకాదు, దానికి సాక్షులుకూడా లక్షలాదిమంది ఉన్నారు.

రాహుస్థలిలో అంటే, కుంద్రత్తూర్ తిరునాగేశ్వరాలయంలో శివుడ్ని దర్శించినా రాహు ప్రభావం చాలా చాలా తగ్గి సుఖశాంతులు లభిస్తాయని స్థలపురాణం చెబుతుంది. ఎలా చూసినా యీ కుంద్రత్తూరులోని మూడు ఆలయాలూ అంటే, శివ, విష్ణు, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలు మూడూ నిర్మించబడి 1000 సంవత్సరాలు దాటినా, ఇంకా నిత్యదీప ధూప అలంకార నైవేద్య, కుంభ, మహా కుంభాభిషేకాలతో నేటికీ దివ్యంగా దినదినమూ భక్తులతో ప్రవర్ధమానమౌతున్నాయంటే, అక్కడి మూలవిరాట్టుల శక్తి వల్లనేగదా!

పూజారి దివ్య వర్చస్సుతో వెలిగిపోతున్న మహాకన్యాదేవికి నమస్కరించాడు. ఇటు అమ్మవారూ, అటు కన్యాదేవి!

అతనికి తెలుగు కొంతవచ్చు. అందుకే హనుమంతుని "ఎక్కడ బస చేశారు?" అని అడిగాడు.

"మద్రాసులో.. ఒక ఆశ్రమంలో. అక్కడి స్వామీజీనే ఈ గుడిని దర్శించుకోమని చెప్పారు. అలాగే విష్ణు, సుబ్రహ్మణ్య దేవాలయాల్ని కూడా సందర్శించమని చెప్పారు" మెల్లగా అన్నాడు హనుమంతు.

"అమ్మ మొహంలో దివ్యతేజస్సు ఉంది" భక్తిగా మరోసారి నమస్కరించి అన్నాడు పూజారి.

"అవును" వినయంగా అన్నాడు హనుమంతు.

"ఈ కుండ్రత్తూరు మద్రాసుకి చాలా దగ్గర. దాదాపు 30 కిలోమీటర్లలోపే అయినా చాలామందికి ఇక్కడి దేవాలయాల సంగతి తెలీదు. వాటి విశిష్టత అసలు తెలీదు. కార్లో అయితే ఓ గంటో గంటన్నరో ప్రయాణం. మురుగన్ (సుబ్రహ్మణ్యస్వామి) ఆలయం మాత్రం చాలా ప్రసిద్ధి చెందింది. కారణం సినిమాలు. కొన్ని వందల తెలుగు తమిళ సినిమాల్లో యీ ఆలయాన్ని చూపించారు. విష్ణు, శివ ఆలయాలు అంత ప్రసిద్ధి చెందలేదు. అందుకే అనంతమైన శక్తితో ఇప్పటికీ ప్రజలకు సాంత్వననిస్తున్నాయి" అన్నాడు పూజారి మెల్లగా. ఆ పూజారి వయసుకూడా ఇరవయ్యో పాతికో. అందుకే అడక్కపోయినా ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు.

ఓ పదినిమిషాల తరవాత మహాకన్యాదేవి కళ్ళు తెరిచింది. ఆమె లేవగానే, అందరూ లేచారు.

గుడినించి బయటకు రాగానే విష్ణువాలయం కార్యనిర్వాహక అధికారీ, ఇతరులూ మహాకన్యాదేవి బృందాన్ని తిరు ఊరహత్త పెరుమాళ్ నీ, తిరువిరుందవల్లి అమ్మనీ దర్శించమని కోరి, ఆలయ మర్యాదలతో లోపలికి తీసుకెళ్ళారు.

కళ్ళారా పెరుమాళ్‌నీ, తిరువిరుందవల్లి మాతనూ దర్శించుకుని, ఆలయ మర్యాదలతోనే సుబ్రహ్మణ్యస్వామినీ (మురుగన్) దేవసేనా వల్లీ మాతలనూ దర్శించుకుని, ఆశ్రమం వారు ఏర్పాటు చేసిన కార్లలోకి చేరారు మహాకన్యాదేవి బృందం.

"అమ్మా రోడ్డు మీదే మనకి కొన్ని కిలో మీటర్ల దూరంలో పంచముఖ ఆంజనేయస్వామి గుడి ఉంది చూద్దామా?" అన్నాడు గైడ్‌గా వచ్చిన నటరాజన్.

"చూద్దాం" అన్నట్టు తలాడించింది ,మహాకన్యాదేవి.

మెయిన్‌రోడ్డులోనే కనిపించింది పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం. ఆ ఊరిపేరు సిక్క రాయపురం. అక్కడ చక్కగా దర్శించుకుని మద్రాసుకి పయనమయ్యారు మహాకన్యాదేవి బృందం.

"అమ్మా ఇందాక మీరు లోకంలో జరగబోయే భయంకరమైన సంఘటనల గురించి చెప్పారు. ఆ విషయాలు మీకు ఎలా తెలిశాయి?" ఉత్సుకతతో అడిగాడు నటరాజన్. నటరాజన్ సన్యాసదీక్ష తీసుకునే క్రమంలో గురువు దగ్గర సంస్కృతాన్నీ, వ్యాకరణాన్నీ మీమాంసలనూ, ఆయుర్వేదాన్నీ, జ్యోతిష్యాన్నీ, వాస్తునీ మహా శాస్త్రాన్నీ గత ఆరేళ్ళుగా నేర్చుకుంటున్నాడు. అన్నిట్లోనూ కృతార్థుడవ్వాలంటే 14 సంవత్సరాలు పడుతుందని గురువైన శ్రీశ్రీశ్రీ సదానందపురి మొదటే చెప్పారు.

"నాకు తెలీదు" చిన్నగా అన్నది మహా కన్యాదేవి. చెప్పడం ఇష్టంలేక అలా అన్నదని హనుమంతుకి అర్థం అయింది. గురు స్థానంలో ఉండేవారిని ప్రశ్నించకూడదనీ, శిష్యస్థానంలో ఉండే సాధకులకు 'కుతూహలం' అసలు ఉండకూడదనీ, ఒకవేళ కుతూహలం పెరిగితే దాన్ని అణుచుకోవాలేగానీ పెద్దవారిని సమయాసమయాలు చూడకుండా ప్రశ్నించకూడదనీ హనుమంతుకి చాలాసార్లు మహామాయి చెప్పింది.

"మరీ" నటరాజన్ ఏదో అనబోతుంటే 'వద్దు' అన్నట్టు అతని చెయ్యిపట్టుకుని సైగ చేశాదు హనుమంతు. ప్రశ్నించడం మాని సైలెంటయ్యాదు నటరాజన్.

"పరవస్తు విశ్వంభరాచార్యులుగారు మాకు చూసి జాగ్రత్తగా చూసుకోమని చెప్పింది రాబీని. ఆయన ఇచ్చింది ఓ హింట్. ఎందుకు చెప్పారూ అన్న ప్రశ్నకి సమాధానం ఆయన దగ్గరకూడా ఉండి ఉండదు. ఓ ఇంపల్స్ లో చెప్పే మాటలు సామాన్యంగా దైవికమయి వుంటాయి. అంటే దైవం మనిషితో పలికించిన మాటలన్నమాట. అందరమూ ఎవరి చోటుకి వారు వెళ్ళడానికి సిద్ధం అయిన యీ పరిస్థితుల్లో రాబీని జాగ్రత్తగా చూసుకునేది ఎవరూ?" స్పష్టంగా అన్నాడు జయ్.

"ధర్మంగా చెప్పాలంటే మీరే చూసుకోవాలి. ఎందుకంటే, అతను వచ్చిందీ కలిసిందీ మిమ్మల్నే. ఇతరులకు కూడా మీద్వారానే పరిచయం అయ్యాడు. లేదా, అతని సోదరుడ్ని పిలిపించండి. ఎందుకంటే, అతను విదేశీయుడు. అతని పేపర్స్ అయిడెంటిటీ సరిగ్గానే ఉన్నా రేపు ఏ చిన్న ప్రమాదం జరిగినా అందరం బాధ్యులమవుతాము" అన్నాడు మొహమ్మద్ అతీమ్.

"ఔను. ఆ మాట నిజమే. న్యాయంగా అతను ఉండాల్సింది ఏ యూనివర్శిటీలోనో, ఎద్యుకేషనల్ ట్రావెల్‌లోనో. ప్రశ్న రానంతవరకూ ఫరవాలేదు. ప్రశ్న మొదలయినప్పుడే ప్రశ్న" చిన్నగా అన్నాడు సుచేత్ దద్లానీ.

జయ్ మౌనంగా అందరివంకా చూస్తున్నాడు.

"జయ్ సాబ్ సచేత్ చెప్పింది నిజం. ఇతని స్థితి ఏమిటో యధాతథంగా అతని సోదరుడికి చెప్పడం మనం చెయ్యాల్సిన మొదటిపని. ప్రభుత్వ అధికారులకు మొత్తం పరిస్థితిని వివరించి వారి సలహా ప్రకారం నడుచుకోవడం రెండోపని. ఆ రెండో, మొదటి పనితోబాటు మూడో ముఖ్యమైన పని ఉన్నది. అది అర్జంటుగా ఇతనికి వైద్య పరిక్షలు చేయించడం.. నిపుణులైన మానసిక వైద్యుల అభిప్రాయాలు తీసుకుని తదనుగుణంగా వైద్యం చేయించాలి. ఈ స్పృహ కోల్పోవడాలూ, ఎవరో ఇతన్ని ఆవహించడాలూ, ఇతను ట్రాన్స్‌లో వింత వింత విషయాలు మాట్లాడటాలూ ఎలా

జరుగుతున్నాయో తేలాలంటే, ముందు మనం వైద్యుల, మనో నిపుణుల సలహా సహకారాలు తీసుకోక తప్పదు" విశదంగా తన అభిప్రాయాన్ని వివరించాడు శమంతో భట్టాచార్య.

"డాక్టరుగారింట్లో ఇన్ని రోజులున్నాం వారు మాత్రం ఇంతమందికి ఆతిధ్యమిస్తూ ఎన్నాళ్ళు భరించగలరూ?" అన్నాడు అతీమ్.

"ఆతిథ్యం విషయంలో నాకో ఆలోచన ఉంది. నన్నూ, నా భర్తనీ, అత్తగార్నీ అందుకు మీరు నియమించవచ్చు. రాబీగార్నేకాదు, ఎంతమందినైనా మేము చూసుకోగలం. అయితే, దిశానిర్దేశానికి ఎవరైనా ఉండక తప్పదు" అన్నది శరద్వతి. చిన్నగా నవ్వాడు గోర్కీ, "అసలు ప్రశ్న ఆ దిశా నిర్దేశం ఎలా చెయ్యాలనేదే సిస్టర్."

"మీ ఉద్దేశ్యం ఏమిటీ?" అడిగాడు స్టిట్సన్, జయ్‌ని.

"ఫ్రెండ్స్. గవర్నమెంటూ, రూల్సు రెగ్యులేషన్సు అన్నీ సర్వకాల సర్వావస్థలలోనూ ఉండేవే. మీరన్నట్లు వారికి ఇన్‌ఫాం చెయ్యడమూ ముఖ్యమే. పరవస్తు విశ్వంభరాచార్యులు చెప్పేంతవరకూ ఇదొక మానసిక అవస్థ అని నేనూ అనుకున్నా. ఎంత దీన్ని ప్రపంచ సమస్యగా భావించినా అలా నా మనసుకి తోచలేదు" ఆగాడు జయ్.

"ఊ.. చెప్పండి" అడిగాడు రాజోవ్‌స్కీ.

"నా దేశానికి వచ్చిన ఓ విదేశీయుడ్ని, అందునా అతని అన్న నాదగ్గరకు పంపగా వచ్చినవాడిని నేను. అతని ఖర్మకి అతన్ని వదిలేసి ఉండలేను. మీరన్నట్టు ప్రభుత్వాధికారులకు విషయం వివరించి, వైద్యపరమైన సలహాలు తీసుకుంటా. బట్, అతన్ని మాత్రం నా దగ్గరే ఉంచుకుంటా. అందుకు ప్రభుత్వానికీ అభ్యంతరం ఉండదు. కారణం అతను మన దేశానికి వచ్చింది నాలా పెర్‌ఫెక్ట్ మోటివ్‌తో. ఇతనూ, ఇతని అన్నగారు నాకు చాలా చాలా పరిచయస్తులే. సో ఇతన్ని తీసుకుని సాయంత్రంగా బయల్దేరి మద్రాస్ వెళ్ళిపోతా, మీ మీ నిర్ణయాలు మీరు నిస్సంశయంగా తీసుకోవచ్చు" అన్నాడు జయ్.

"పడుగూ పేకా పద్ధతిలో దారాల్ని నేస్తే బట్ట అవుతుంది. ఆ పడుగూ పేకల దారాల్ని విడివిడిగా లాగేస్తే బట్ట మాయమై దారాలే మిగులుతాయి. గుడ్.. వెరీగుడ్" పకపకా నవ్వి అన్నారు యజ్ఞప్పగారు.

చిన్నగా నవ్వుతూ ఆ మాటను ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేసి ఫారినర్స్‌కి చెప్పాడు గోర్కీ.

"యస్... వాట్ హి సెడ్ యీజ్ రైట్. హీ యీజ్ ఎ వెరీ వైజ్ ఓల్డ్ జంటిల్‌మన్" మెచ్చుకున్నాడు డాంటే.

"మరొక ఛాయిస్ ఏమన్నా ఉందా?" సీరియస్‌గా అడిగాడు జయ్.

"ప్రస్తుతానికి ఏదీ లేనట్టే" అన్నాడు అతీమ్.

"ఆకాశం నిండా నల్లని మబ్బులు నల్లత్రాచుల్లా ఒకటికొకటి పెనవేసుకుని వచ్చి పట్టపగటినే చిమ్మ చీకటి చేశాయి. ఆ తరవాత చిన్న చిన్న ఒక్క జల్లుమాత్రమే  చిలకరించి వేటి దారిన అవి గాలికి విరిగిపోయే వస్త్రాల్లాగా కకావికలుగా ఎగిరిపోతున్నై. అవును. ఏ నేలపక్షి ఆ నేలకి చేరాల్సిందే!"

ఓ నైరాశ్యంతో అన్నారు యజ్ఞప్ప. మదాలస  మొఖం మీద ఓ ప్రశ్నార్ధకం. శరద్వతి, శ్రీనివాసూ యజ్ఞప్పగారివంకే తదేకంగా చూస్తున్నారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments